నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, మంగళవారం 9 జూలై 2024 | YADADRI BHUVANAGIRI

భువనగిరి పట్టణంలోని భగాయత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో స్మార్ట్ క్లాస్ రూమ్‌ను ప్రారంభించి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కలెక్టర్ హనుమంతు కె. జెండగే. సినీ నటి మంచులక్ష్మి తదితరులు

ప్రైవేటు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- టీచ్ ఫర్ ఛేంజ్, క్లౌడ్ 4సీ స్వచ్ఛంద సంస్థల సేవలు మరువలేనివి
- ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్, జూలై 8 : రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు పాఠశాలల్లో వసతులు కల్పిస్తున్నదని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణంలోని భగాయత్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో సోమవారం కలెక్టర్ హనుమంత్ కె.జెండగే, సినీనటి, టీచ్ ఫర్ ఛేంజ్ సంస్థ ఫౌండర్, చైర్‌పర్సన్ మంచు లక్ష్మితో కలిసి స్మార్ట్ క్లాస్ రూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కుంభం మాట్లాడుతూ జిల్లాలో ఈ ఒక్క రోజే టీచ్ ఫర్ ఛేంజ్, క్లౌడ్ 4సీ స్వచ్ఛంద సంస్థలు కలిసి 33 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్‌లు పారంభించుకోవడం అభినందనీయమని అన్నారు. ఇంటర్నేషనల్ స్కూల్స్‌లో ఉండే డిజిటల్ ఎడ్యుకేషన్ విధానం ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పరచాలనే సంకల్పం, ఆశయం గొప్పదని, సమాజానికి సంస్థ చేస్తున్న కృషి మరువలేనిదని తెలిపారు. జిల్లాలో మరో వంద స్మార్ట్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటుకు ముందుకు వచ్చినందుకు, బగాయత్ ప్రభుత్వ పాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేసినందుకు సంతోషమన్నారు. డిజిటల్ క్లాస్‌లను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత స్థానాలు పొందాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు దివీస్ కంపెనీ సహకారంతో 40 వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేశారని తెలిపారు. పాఠశాలల్లో టాయిలెట్స్, కాంపౌండ్ వాల్ లేని ప్రభుత్వ పాఠశాలలు ఉండొద్దని, అందుకోసం అందరి సహకారం తీసుకుంటామని చెప్పారు.

స్మార్ట్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయం : కలెక్టర్

టీచ్ ఫర్ ఛేంజ్ స్వచ్ఛంద సంస్థ ముందుకు వచ్చి జిల్లాలో రెండు సంవత్సరాల్లో సుమారు 90 పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్‌ల ఏర్పాటు చేయడం అభినందనీయమని కలెక్టర్ హనుమంతు జెండగే అన్నారు. విద్యార్థులకు సాంకేతికత నాలెడ్జ్ ముఖ్యమని, స్మార్ట్ క్లాస్ రూమ్‌లు అందుకు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా మౌలిక సౌకర్యాలు కల్పిస్తున్నట్లు చెప్పారు.

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు తేడా ఉండొద్దు : మంచు లక్ష్మి

ప్రభుత్వ–ప్రైవేటు పాఠశాలల్లో చదివే విద్యార్థులకు విద్యా, వసతుల్లో తేడా ఉండకూడదని, ప్రైవేటు పాఠశాలల్లో అందించే డిజిటల్ విద్యను అందించడానికి స్మార్ట్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేస్తున్నామని సినీ నటి, టీచ్ ఫర్ ఛేంజ్ ఫౌండర్, చైర్‌పర్సన్ మంచు లక్ష్మి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో సోమవారం 33 స్మార్ట్ క్లాస్ రూములు ప్రారంభించుకున్నామని చెప్పారు. ఈ స్మార్ట్ క్లాస్ రూమ్‌లలో బేస్ లైన్, ఎండ్ లైన్, మిడ్ లైన్ పద్ధతిలో డిజిటల్ బోధన జరుగుతుందన్నారు. స్మార్ట్ క్లాస్ రూమ్‌లలో స్మార్ట్ టీవీ, పెయింటింగ్ వర్క్స్, లోలైన్ టేబుల్స్, ఆడియో విజువల్, కరికులమ్ అందిస్తామని, ఇందుకోసం ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తామని తెలిపారు. క్లౌడ్ 4సీ స్వచ్ఛంద సంస్థ సీఈఓ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మరో వంద ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్ రూమ్‌లు ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో భువనగిరి మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ కె.గంగాధర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాయా దశరథ, జిల్లా విద్యాశాఖ అధికారి కె.నారాయణరెడ్డి, మండల ఎడ్యుకేషన్ అధికారి నాగవర్ధన్‌రెడ్డి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ భారతమ్మ, టీచ్ ఫర్ ఛేంజ్ టీమ్ సభ్యురాలు ఐశ్వర్య, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సార్ పింఛన్ ఇప్పించండి

భువనగిరి అర్బన్, జూలై 8 : భువనగిరి పట్టణంలోని భగాయత్ పాఠశాలలో స్మార్ట్ క్లాస్ రూమ్ ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిని అదే పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న దానసాయి నిలదీసినట్లు ప్రశ్నించాడు. సమావేశం స్టేజీ ముందు కూర్చున్న విద్యార్థి ఒక్కసారి లేచి వచ్చి చేతిలోకి మైకు తీసుకుని 'కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి సార్ నాకు పింఛన్ వస్తలేదు' అని చెప్పాడు. స్పందించిన ఎమ్మెల్యే పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తన కుడిచేయి పనిచేయదని, సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసినా రాలేదని, అందుకే ఎమ్మెల్యేను అడిగినట్లు విద్యార్థి తెలిపాడు.

విద్యార్థి దానసాయి

గుట్టలో సంస్కృత పాఠశాల నూతన భవనం నిర్మిస్తాం : మంచు లక్ష్మి

యాదగిరిగుట్ట, జూలై8 : శ్రీ లక్ష్మీనరసింహ స్వామి సంస్కృత విద్యా పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంస్కృత పాఠశాలకు నూతన పాఠశాల భవనాన్ని తమ సొంత ఖర్చులతో నిర్మిస్తామని సినీ నటి మంచు లక్ష్మీ ప్రకటించారు. యాదగిరి గుట్టలో సోమవారం లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకున్న ఆమె కొండకింద ఆండాళ్ నిలయం ప్రాంగణంలో సంస్కృత విద్యా పీఠాన్ని ఆలయ ఈఓ భాస్కర్‌రావుతో కలిసి పరిశీలించారు. విద్యార్థులతో ముచ్చటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎన్నో పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధి పరుస్తున్న నేపథ్యంతో సంస్కృత పాఠశాలకు నూతన భవనం నిర్మించి సహాయం చేయాలని ఈఓ భాస్కర్‌రావు కోరగా ఆమె సానుకూలంగా స్పందించారు. ఇందుకు కావాల్సిన ప్రాజెక్టు రిపోర్టును సిద్ధం చేసి ఇవ్వాలని మంచు లక్ష్మి దేవస్థాన అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన సివిల్ విభాగం ఈఈ దయాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో మందుల కొరతపై ఆరా

చౌటుప్పల్, జూలై 8 : మున్సిపాలిటీ పరిధిలోని తంగెడపల్లి పీహెచ్‌సీలో మందుల కొరత ఉండడంతో ఈ నెల 6న 'పీహెచ్‌సీల్లో మందుల కొరత' శీర్షికన నమస్తే తెలంగాణలో కథనం ప్రచురితమైంది. దానికి వైద్య ఆరోగ్య శాఖ అధికారులు స్పందించారు. మందుల కొరతపై సోమవారం చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని బస్తీ దవాఖానలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో డిప్యూటీ డీహెంఎచ్‌ఓ శిల్పిని ఆరా తీశారు. మందుల కొరతను అధిగమించేందుకు పై అధికారులతో కూడా ఆమె మాట్లాడినట్లు సమాచారం. సీజనల్ వ్యాధుల దృష్ట్యా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని పై అధికారులను ఆమె కోరారు.

చౌటుప్పల్ బస్తీ దవాఖాన వైద్యాధికారులతో మాట్లాడుతున్న డిప్యూటి డీఎంహెచ్‌ఓ శిల్పిని

'హద్దులు' దాటుతున్న రేషన్ బియ్యం

అక్రమంగా ఆంధ్రాకు తరలింపు

- రీ సైక్లింగ్ చేసి గుజరాత్‌కు ఎగుమతి
- కీలక పాత్ర పోషిస్తున్న సివిల్ సప్లయ్ గోదాము ఇన్‌చార్జీలు
- రేషన్ షాప్‌లకు రాకుండానే మాయం
- కేజీ బియ్యం రూ. 6 నుంచి రూ. 8కి కొనుగోలు
- మాముళ్ల మత్తులో అధికారులు
- 100కి సమాచారం ఇస్తే దళారులకు చేరినట్లే!

పేదలు ఆకలితో పస్తులు ఉండకూడదనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా కుటుంబాలకు సరిపడా పీడీఎస్ బియ్యాన్ని రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేస్తున్నాయి. కొంత మంది దళారులు రేషన్ దుకాణాలు, గోదాముల నుంచి కొంత ఆశచూపి ఆ బియ్యాన్ని సరిహద్దులు దాటించి అక్రమార్జన పొందుతున్నారు. కృష్ణా తీరం, రెండు రాష్ట్రాలకు సరిహద్దు ప్రాంతం కావడంతో ఈ దందాకు మరింత ఊతమిస్తున్నది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని నేరేడుచర్ల, మఠంపల్లి, చింతపాలెం, పాలకవీడు, హుజూర్‌నగర్, మేళ్ల చెర్వు మండలాలతో పాటు నల్లగొండ జిల్లా దామరచర్ల నుంచి ఎక్కువ మొత్తంలో రేషన్ బియ్యం లారీల్లో తరలిస్తున్నారు. బడా వ్యాపారుల ప్రలోభాలకు లొంగిన పల్లెల్లోని కొందరు అమాయకులు బియ్యం సేకరించే దందాను కుటీర పరిశ్రమగా మార్చుకున్నారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ నెల 6న దామరచర్లలో పట్టుబడిన 22 క్వింటాళ్ల రేషన్ బియ్యంలో హుజూర్‌నగర్‌లోని మార్కెట్ గోదాము ఇన్‌చార్జి, నేరేడుచర్లకు చెందిన పలువురు రేషన్ డీలర్లపై కేసు నమోదవడమే ఇందుకు నిదర్శనం.

– నేరేడుచర్ల, జూలై 8

హుజూర్‌నగర్ నుంచి అక్రమంగా తరలిస్తూ దామరచర్ల వద్ద పట్టుబడిన రేషన్ బియ్యం లారీ (ఫైల్)

పేదలకు చెందాల్సిన రేషన్ బియ్యాన్ని కొందరు పక్కదారి పట్టిస్తూ దందా సాగిస్తున్నారు. యథేచ్ఛగా రేషన్ బియ్యం కొనుగోలు చేస్తూ సరిహద్దులు దాటిస్తున్నారు. ఈ పరిస్థితి కృష్ణా తీర ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నది. మధ్యతరగతి, ఆర్థికంగా ఉన్నవారు పీడీఎస్ బియ్యం తీసుకోకపోవడంతో దళారులు గ్రామాల్లో వాలిపోయి కిలో బియ్యం రూ. 6 నుంచి రూ. 8 చెల్లించి పెద్దఎత్తున సేకరిస్తున్నారు. నిత్యం ఎక్కడో ఒక దగ్గర పట్టుబడుతున్నా వారి తీరు మారడం లేదు. వీరు ఈ దందాను కొనసాగించడం కోసం అధికారులకు పెద్దఎత్తున మాముళ్లు ఇస్తున్నట్లు తెలుస్తున్నది. అంతే కాకుండా కొంత మంది అధికార పార్టీ నాయకులు వీరికి మద్దతుగా నిలిచి ప్రోత్సహిస్తున్నారు. వారే దగ్గర ఉండి సహకరిస్తున్నట్లు తెలుస్తుంది. పీడీఎస్ బియ్యంలో అవినీతి, అక్రమాలు జరిగితే సహించేది లేదని హుజూర్‌నగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, పౌర సరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి ఇటీవల జరిగిన సమావేశంలో కూడా హెచ్చరించారు. తమ పార్టీ వారైనా సరే ఊరుకోనని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయిన ప్పటికీ కొంత మంది అధికారులు నిద్రమత్తు వీడడం లేదు. మామూళ్లకు అలవాటు పడిన వారు తీరు మార్చుకోవడం లేదు. ఇప్పటికైనా దళారులకు కొమ్ముకాస్తున్న అధికారులను గుర్తించి వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

గోదాము నుంచే నేరుగా తరలింపు

రేషన్ దుకాణాలకు తరలించే పౌర సరఫరా గోదాము నుంచే నేరుగా రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు తెలుస్తున్నది. ప్రభుత్వం ప్రజలకు అందించే రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లై అధికారుల ద్వారా ప్రతి నెలా రేషన్ దుకాణాలకు చేరుతున్నది. అయితే సివిల్ సప్లై అధికారులు ఈ రేషన్ షాపుల పరిధిలోని కార్డులను బట్టి ఏ షాపునకు ఎంత రేషన్ బియ్యం అందించాలో ఆ లెక్క ప్రకారం గోదాములో కాంటా వేసి లారీల ద్వారా డీలర్లకు అందజేస్తారు. ఈ రేషన్ బియ్యాన్ని అక్కడ ఉన్న కార్డుదారులకు డీలర్లు పంపిణీ చేయాల్సి ఉంటుంది. కార్డు ఉన్న వారిలో కొంత మంది రేషన్ బియ్యం మంచిగా లేక పోవడంతో తీసుకోరు. మరికొంత మంది రేషన్ బియ్యం తినలేక ఆ బియ్యాన్ని డీలర్లకే కేజీకి రూ. 6 నుంచి 8 వరకు విక్రయిస్తారు. ఇదే అదునుగా భావించిన రేషన్ డీలర్లు ప్రతి నెలా ఎంత కోటా సరిపోతుంది అనే విషయాన్ని ముందస్తుగానే గుర్తించడంతో ఆ మిగులు బియ్యాన్ని రేషన్ షాపులకు రాకుండానే డీలర్లు గోదాము వద్ద ఉన్న అధికారులకు ముడుపులు ఇస్తూ అక్కడే నిల్వచేసి లారీల ద్వారా రాత్రి సమయంలో ఆంధ్రా ప్రాంతాలకు నేరుగా తరలిస్తున్నట్లు తెలుస్తుంది. అంతే కాకుండా కొంత మంది దళారులు విడివిడిగా కొనుగోలు చేసి ఒక చోటకు చేర్చుతారు. ఎక్కువ మొత్తంలో కాగానే వాటిని లారీలకు ఎత్తుతున్నట్లు తెలుస్తుంది. ఈ విధంగానే ఇటీవల దామరచర్ల వద్ద లారీలోని 22 టన్నుల బియ్యం పట్టుబడింది.

ఆంధ్రా వ్యాపారుల పాత్ర

ఆంధ్రా సరిహద్దు ప్రాంతాలైన కృష్ణ పట్టి మండలాల్లో ఈ దందా ఎక్కువ మొత్తంలో జరుగుతున్నది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఈ దందా జోరుగా కొనసాగుతున్నది. రేషన్ బియ్యం కొనుగోలులో ఆంధ్రాకు చెందిన వ్యాపారులే ప్రధాన పాత్ర పోషిస్తున్నారను. పిడుగురాళ్లకు చెందిన ముగ్గురు ప్రధాన సూత్రధారులుగా ఉన్నట్లు సమాచారం. వీరిపై ఇప్పటికే చాలా కేసులు వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైనట్లు తెలుస్తున్నది. అధికారులకు ముడుపులు ఇస్తూ వారి దందా కొనసాగిస్తున్నారు. కొంత మంది రేషన్ డీలర్లను మచ్చిక చేసుకొని వారి నుంచి బియ్యాన్ని కొనుగోలు చేసి ఆటోలు, టాటా ఏస్‌లలో ఒక చోటకు తరలించి పెద్దఎత్తున నిల్వ చేసి అర్ధరాత్రి లారీల్లో ఆంధ్రాకు తరలిస్తున్నారు. వీరు జైలు శిక్ష అనుభవించినప్పటికీ వారు మాత్రం ఈ దందాను ఆపడం లేదంటే దీనిలో ఎంత లాభాలను ఆర్జిస్తున్నారో అర్థమవుతున్నది.

100కి ఫోన్ చేస్తే దళారులకు సమాచారం

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారని 100కి డయల్ చేసి సమాచారం అందిస్తే వెంటనే అక్రమంగా సరఫరా చేసే దళారులకు తెలిసిపోతుంది. అది ఎలా అంటే 100కి సమాచారం అందిన వెంటనే అది ఏ మండల పరిధిలోకి వస్తే ఆ పోలీస్ స్టేషన్‌కు, ద్విచక్రవాహనంపై తిరిగే బ్లూకోర్టు వారికి సమాచారం అందిస్తారు. వెంటనే బైక్‌పై తిరిగే బ్లూకోర్టు సిబ్బంది దళారికి ఫోన్ చేసి చెప్తున్నారు. 'మీరు బియ్యం తీసుకెళ్తున్నట్లు 100కి ఫోన్ చేశారు.. మేము వస్తున్నాం.. మీరు అక్కడి నుంచి వెళ్లిపోవాలి' అని సూచిస్తున్నట్లు తెలుస్తుంది. ఆ తర్వాత అక్కడికి చేరుకున్న పోలీస్ సిబ్బంది ఎవరో తప్పుడు సమాచారం అందించారని, ఇక్కడ ఎవరూ లేరని పై అధికారులకు తెలుపుతున్నారు. దీనికి గానూ వారికి భారీ స్థాయిలోనే ముడుపులు అందుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

ద్విచక్ర వాహనాలపై ఎస్కార్ట్

రేషన్ బియ్యం అక్రమాలకు పాల్పడేవారు ముందుస్తుగా నిఘా ఏర్పాటు చేసుకుంటున్నట్లు సమాచారం. వారి వెళ్లే దారిలో ఎవరైనా అధికారులు ఉన్నారా లేదా అనే విషయాన్ని పసిగడుతారు. దీని కోసం అక్రమార్కులు ముందస్తుగా ద్విచక్ర వాహనంపై వెళ్తూ వెనుకాల వచ్చే బియ్యం వాహనానికి ఫోన్‌లో సూచనలు చేస్తుంటారు. ఎక్కువగా రాత్రి వేళల్లో, తెల్లవారు జామున రవాణా చేస్తున్నారు. ఇక ఆటోలు, టాటా ఏస్‌లో అయితే పట్టపగలే వెళ్తున్నా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

రీసైక్లింగ్ చేసి గుజరాత్‌కు తరలింపు

తెలంగాణ నుంచి అక్రమంగా రేషన్ బియ్యాన్ని ఆంధ్రాకు తరలిస్తున్నారు. పల్నాడు జిల్లా దాచేపల్లి కేంద్రంగా చేసుకొని రేషన్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేసి గుజరాత్‌కు, వైజాక్ పోర్టుకు తరలిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇక్కడ రూ. 6 నుంచి 8కి కొనుగోలు చేసిన బియ్యాన్ని ఆంధ్రాలో రీసైక్లింగ్ చేసి నూకను వేరు చేస్తారు. ఆ తర్వాత అక్కడి నుంచి రూ. కేజీ బియ్యం రూ.28 గుజరాత్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. దాంతో వారు పెట్టే ఖర్చుకు పోను ఎక్కువ మొత్తంలో లాభం ఉంటుంది. ఈ దందాకు దాచేపల్లి ప్రాంతానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి అండదండలతోనే సాగిస్తున్నట్లు తెలుస్తున్నది. వీరి అక్రమ దందాను ఆపేందుకు పోలీసులు ప్రయత్నాలు చేసినా ఆగే పరిస్థితి లేదు. గతంలో వీరిని పట్టుకునేందుకు వెళ్లిన ఉమ్మడి జిల్లాకు చెందిన సంబంధించిన పోలీసులపై కూడా వీరు దాడులు చేసిన సంఘటనలు ఉన్నాయి.

లోపించిన పోలీస్ నిఘా

పోలీస్ వ్యవస్థలో నిఘా లోపించడం వల్లే రేషన్ బియ్యం అక్రమ రవాణా జోరుగా సాగుతున్నది. అధికారుల కళ్లుగప్పి రేషన్ బియ్యం అంధ్రాకు తరలిస్తున్నారు. గతంలో రాత్రి సమయంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించేవారు. ఎవరైనా అనుమాన వ్యక్తి కనబడితే వివరాలు సేకరించేవారు. ఇప్పుడా పరిస్థితి కనిపించడం లేదు. గతంలో మాదిరిగా రాత్రి సమయంలో పోలీసుల గస్తీని పెంచి అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నైపుణ్య అభివృద్ధి కేంద్రంగా రామానంద సంస్థ

- పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు అద్భుతం
- ట్రైనీ ఐఏఎస్ అధికారులు



స్వామి రామానంద తీర్థలో టైలరింగ్ శిక్షణను పరిశీలిస్తున్న ట్రైనీ ఐఏఎస్‌లు

భూదాన్‌పోచంపల్లి, జూలై 8 : నిరుద్యోగులకు చేతివృత్తుల నైపుణ్యంలో శిక్షణ ఇచ్చి స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ ఉపాధి కల్పిస్తున్నదని ట్రైనీ ఐఏఎస్ అధికారులు బృందం అన్నారు. భూదాన్ పోచంపల్లి మండలం జలాల్‌పూర్ గ్రామంలోని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థను సోమవారం ఏడుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు సందర్శించారు. సంస్థలో నిర్వహిస్తున్న శిక్షణ కోర్సులను వారు పరిశీలించారు. అనంతరం పోచంపల్లిలోని కళా పునర్వి హ్యాండ్లూమ్ యూనిట్, చేనేత సహకార సంఘం, టూరిజం పార్క్‌లోని చేనేత మ్యూజియాన్ని సందర్శించారు. కళా పునర్వి యూనిట్‌లో సిల్క్ దారం తయారీ, కండెలు చుట్టడం, రంగులు అద్దడం, చేనేత మగ్గాలు, వస్త్రాల తయారీ ప్రక్రియలను పరిశీలించారు. చేనేత సహకార సంఘంలో వస్త్రాలను తిలకించారు. సాయిని భరత్ సంప్రదాయ చేనేత వృత్తికి ఆధునిక సొబగులు జోడిస్తూ భావితరానికి ఈ వృత్తిని అందిస్తున్న తీరును అభినందించారు. ఈ సందర్భంగా ట్రైనీ ఐఏఎస్‌లు మాట్లాడుతూ రామానంద సంస్థలో నిర్వహిస్తున్న ఉచిత శిక్షణ కోర్సులు ఎంతో బాగున్నాయని, నిరుద్యోగులు శిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుద్యోగులకు శిక్షణ కోర్సులు అందిస్తున్న రామానంద సంస్థ అధికారులను వారు అభినందించారు. అంతర్జాతీయంగా పేరుగాంచిన పోచంపల్లి ఇక్కత్ వస్త్రాలు సంప్రదాయకంగా చాలా బాగున్నాయని ప్రశంసించారు. చేనేత కళాకారుల నైపుణ్యం అద్భుతంగా ఉందని కొనియాడారు. ఈ బృందంలో ట్రైరీ ఐఏఎస్ అధికారులు ఉమాహారతి, అజ్మీరా సాకేత్‌కుమార్, గరిమానరూల, అభిజ్ఞాన్ మాల్వియా, అజయ్‌యాదవ్, మ్రినల్ శీర్షిత, ఈఎస్ఎస్‌డీ మనోజ్ (అసిస్టెంట్ కలెక్టర్లు), మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్ర హెచ్ఆర్‌డీ నోడల్ అధికారి శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి విద్యాసాగర్, స్వామి రామానంద తీర్థ ఇన్‌చార్జి డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి, రీజినల్ ట్రైనింగ్ మేనేజర్ వెంకటేశ్, తాసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, ఎంపీడీఓ రాపర్తి భాస్కర్, ఎంఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సహకార సంఘం రుణాలను సద్వినియోగించుకోవాలి

- టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్టలో రైతులకు చెక్కులను అందజేస్తున్న టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

యాదగిరిగుట్ట, జూలై8 : సహకార సంఘాల ద్వారా వచ్చే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టెస్కాబ్ మాజీ వైస్ చైర్మన్, వంగపల్లి పీఏసీఎస్ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. యాదగిరిగుట్ట పట్టణంలోని తన నివాసంలో సోమవారం ఆయన వంగపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ద్వారా మంజూరైన దీర్ఘకాలిక రుణాల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. రుణాలను తీసుకున్న రైతులు సకాలంలో చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు. డెయిరీ ఫామ్ కోసం మండలంలోని చిన్న కందుకూరు గ్రామానికి చెందిన సుబ్బూరు శ్రీనివాస్‌కు రూ. 3.50 లక్షలు, బీమగాని బాలరాజుకు రూ. 2.85 లక్షలు, బీమగాని పార్వతమ్మకు రూ. 3 లక్షలు, మోటకొండూర్‌కు చెందిన వంగపల్లి శ్రీనివాస్‌కు రూ. 12.35 లక్షలు మంజూరయ్యాయి. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ భద్రారెడ్డి, రైతులు విఠల్, వంగపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సిల్క్ మార్క్ వేసి పట్టు చీరెలు విక్రయించాలి

- సిల్క్ మార్క్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు అలీ, రఘు

భూదాన్ పోచంపల్లి, జూలై 8 : పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరెలు విక్రయించే వ్యాపారులు సిల్క్ మార్క్ వేసి విక్రయించాలని సిల్క్ మార్క్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా, సెంట్రల్ సిల్క్ బోర్డు, మినిస్ట్రీ ఆఫ్ టెక్స్‌టైల్స్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు ఎండీ అలీ, రఘు అన్నారు. పట్టణంలో ఆన్‌లైన్ ద్వారా పోచంపల్లి ఇక్కత్ పట్టు చీరెలు విక్రయిస్తున్న వ్యాపారులకు సోమవారం సిల్క్ మార్క్ సర్టిఫికేషన్, సిల్క్ మార్క్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వ్యాపారులకు నూతన సిల్క్ మార్క్ సర్టిఫికేషన్ అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి వ్యాపారి సిల్క్ మార్కును వినియోగించాలన్నారు.

వ్యాపారులకు సిల్క్ మార్క్ సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రతినిధులు

జిల్లా వాసులకు కార్పొరేషన్ పదవులు

- ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నగరిగారి ప్రీతమ్
- రాష్ట్ర మహిళా సహకార సంస్థ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా బండ్రు శోభారాణి

యాదగిరిగుట్ట, జూలై8 : రాష్ట్ర మహిళా సహకార సంస్థ డెవలప్ మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్‌గా ఆలేరుకు చెందిన బండ్రు శోభారాణిని ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉత్తర్వులు జారీ చేశారు. రెండు సంవత్సరాలపాటు చైర్‌పర్సన్‌గా కొనసాగనున్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలోని రామాయంపేట పరిధికి చెందిన శోభారాణి ఆలేరుకు చెందిన బండ్రు భాస్కర్‌ను జనశక్తిలో పనిచేసే సమయంలోనే వివాహం చేసుకున్నారు. ఆలేరు రాజకీయాల్లో క్రీయాశీలకంగా వ్యవహరించారు. బీఆర్ఎస్, టీడీపీ, బీజేపీలో పలు హోదాలో పని చేశారు. 2009లో ప్రజారాజ్యం పార్టీ నుంచి ఆలేరు ఎమ్మెల్యేగా పోటీ చేశారు. ప్రస్తుతం టీపీసీసీ ఉపాధ్యక్షురాలుగా కొనసాగుతున్నారు.

నగరిగారి ప్రీతమ్

బండ్రు శోభారాణి

ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నగరిగారి ప్రీతమ్

మోత్కూరు, జూలై8 : రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా మోత్కూరు మున్సిపాలిటీకి చెందిన నగరిగారి ప్రీతమ్‌ను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ శాంతికుమారి సోమవారం ఉత్వర్వులు జారీ చేశారు. ప్రీతమ్ నియమాకం పట్ల మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం కవితాల క్ష్మీనర్సింహారెడ్డి, వైస్ చైర్మన్ బొల్లేపల్లి వెంకటయ్య, పార్టీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు.

పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా రమేశ్‌రెడ్డి బాధ్యతలు

సూర్యాపేట రూరల్, జూలై 8 : తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా పటేల్ రమేశ్ రెడ్డి సోమవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని టూరిజం కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, అభిమానులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



పటేల్ రమేశ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు